# స్వయంకృతం

"ఇన్నాళ్ళయింది శుభ్రంగా వంటయినా చెయ్యడం రాదుగదా! ఛీ ఛీ - ఏమిటీ కూర! యిది వంకాయ కూరేనా? దాని రుచి, అంత చెడగొట్టేశావు! శెనగపప్పూ, బొబ్బర్లూ, అల్లం, పచ్చిమిరపకాయలూ, గుమ్మడొడియం ముక్కలూ, యివన్నీ దాని సహంగులు! అవి వుంటేనే వంకాయి సుద్ద. రాత్రికి నేను తయారు చేస్తాను చూడు! ఆవేళ తిన్నావు తెలీదూ!" అని గొణుగుతూ అంటున్నాడు భద్రం, అన్నానికి కూర్చొని కూర్చోకముందే!

ఇలా అంటాడని అమలకు తెలుసు. అమల భయపడుతూనే వుంటుంది అయినా ప్రతి రోజూ చీవాట్లు తప్పవు. మెతుగు మెతుగూ ఎంచి అలాకాదని చెబుతూనే వుంటాడు. అది తనకి కొత్తకాకపోయినా ఆడదయిన తర్వాత వంట విషయంలో - ఆ డిపార్టుమెంటుతో సంబంధంలేని మొగవాడు ఎత్తిపొడుస్తూ ఎంచుతూంటే ఏ స్త్రీ సహిస్తుంది! దానికన్నా అవమానం వేరేవుందా?

నిజానికి భద్రం బాగానే వండగలడు. గవర్నమెంటువారి పుణ్యమా అని యీ బేసిక్ ట్రయినింగులో ఆరితేరిన అయ్యవారి పెళ్ళాలందరికి యీ సుఖం లభించింది. - అదేమిటీ అంటే ఖాళీగా వుండే మూడురోజుల్లోనూ కడుపులో చల్ల కదలకుండా నవరుచులతోనూ, నాలికమీద పెట్టుగుంటే జిహ్వ లేచి వస్తుందా అన్నటువంటి భోజనం దొరుకుతుంది - సాధారణంగా ఆడవాళ్ళకటువంటి భోజన సుఖం లబ్బడం మహా అదృష్టమన్నమాటే! ఆ మూడు రోజులూ భర్త వండిన అన్నం తినే కన్నా ఉపవాసం నయం అనుకున్నవాళ్ళూ వున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బేసిక్ ట్రయినింగ్ అయిన అయ్యవారిని వరించిన ఆడదానిదే అదృష్టమంటాను. దానికి వాళ్లెటువంటి నోములు నోచేరో!

అటువంటి వాడే భద్రం కూడా - అమలకి ఆ భాగ్యం కలగడం బాగానే వుంది గాని, రోజూ భర్త వండుతానన్నా వండించగలదా - అందుకే తను వండి నానా తిట్లూ తింటున్నది. భద్రం వండడం ఎలాగూ మానడు. ఎందుకంటే తనకి ఆ వేళలో బడి వుండదు కాబట్టి, వుత్తినే అలా వుంటే తోచదుట! ట్రయినింగు స్కూల్లో అలవాటుపడడం వల్ల మనస్సు వంటింటి వేపే వుంటుంది! అక్కడికీ అమల బొత్తిగా ఒప్పుకోనప్పుడు, అలాగూ, యిలాగూ, అని చెబుతూనే వుంటాడు. అమల ఒప్పుగుంటే రోజూ రెండుపూట్లా వండడానికి తనకేమీ అభ్యంతరం లేదు.

అమలది అమృతహస్తం. వంటల్లో ఆమె అన్నపూర్ణ, అన్ని విషయాల్లోనూ ఆమెలో ఏదో ఒక ప్రత్యేకత వుంటూంటుంది. అయినా భర్త దగ్గర మెప్పు పొందలేకపోతున్నది. ఇహ శని, ఆదివారాలు

వచ్చేయంటే, భద్రం గిన్నె గరిటా వదలడన్నమాటే! ఆవేళ ఒకగండం, పోనీ ఏదో వండి పడేస్తాడ అంటే అమలని వదుల్తాడా! దగ్గర కూర్చోబెట్టుకొని పాకశాస్త్రం అంతా చెప్పి వల్లించమంటాడు! అతని ఉపదేశం, యీమె పాకం అయేటప్పటికి తద్దినం భోజనంలాగా ఏ మూడో, నాలుగో అవవలసిందే!

ఒక ఆదివారం నాడు వంట సరంజామా అంతా చుట్టూ పేర్చుగొని కూర్చున్నాడు! అమల చేతులు కట్టుకొని వింటూ నిలుచుంది -

భద్రం ఉపోద్ఘాతం మొదలెట్టేడు.

''వింటున్నావా ! యివాళ పులిహోర చేస్తాను ! నేను బేసిక్ ట్రయినింగవుతున్నప్పుడు నాలా ఎవరూ వంట చెయ్యలేకపోయేవారు ; నేను వంట బేచ్‌లో పడ్డానంటే - ఆవేళ అందరికీ ఓ పెద్ద పండుగలాగూ సంతర్పణలాగూ వుండేది ! నా ఎడం చెయ్యి నలుడూ కుడి చెయ్యి భీముడూ అనుకో ! అందులోనూ యీ పులిహోర చేసేనంటే రాసులు రాసులు ఇట్టే తినేసేవారు ! ఇవాళ నీకు పులిహోర గురించి చెబుతాను విను, మళ్లీ చెయ్యమంటే టక్కున చేసెయ్యాలి !''

అమల వస్తూన్న నవ్వు ఆపుగుంటూ వింటున్నది.

బియ్యం ఎసరు పెట్టేడు. వుడుకుతోంది.

''ఇదిగో చూశావా ! యిప్పుడు కొంచం బిరుసుగా వుండగానే తీసి వార్చేయాలి ! ఆ తర్వాత పులిహోర ఎక్కువ తక్కువని బట్టి సొడుం పట్టు అంతలేసి పసుపు యిలా వెయ్యాలి !'' అంటూ మూడుసార్లు వేసేడు.

''లేకపోతే ఎక్కువయిపోయి పసుపు వాసన వేసేస్తుంది !'' అంటూ చాపమీద గుమ్మరించేడు-

''ఇదిగో ! వెళ్ళి అయిదారు బొట్టలు చింతపండు తీసుకురా ! ఎక్కువ వద్దు ! '' అని అమలతో చెప్పేడు, ఆమె తెచ్చి యిచ్చింది.

''ఇప్పుడు చూడు !'' అన్నాడు. అని చింతపండు పులుసు చిక్కగా పిసిగి ''చిక్కగా వుండాలి సుమా !'' అని హెచ్చరిస్తూ పోసేడు.

ఆ తర్వాత కరివేపాకు నాలుగంటే నాలుగు రెమ్మలు రెల్చి వేశాడు, అల్లం, పచ్చిమిరపకాయలూ, లెక్కగా చితక్కొట్టి తెమ్మని, ఆమె తేగా దాంట్లో వేసేడు.. మినప్పప్పు, ఎండుమిరపకాయలూ, ఆవాలూ, శనగపప్పూ), ఒక గరిటిలో వేయించి ఆ పోపూ - నువ్వుల గుండా, నిమ్మకాయ రసం వేసేడు. యింగువ తెమ్మన్నాడు. అమల యింగువ పలుకులే వేయబోగానే అలాక్కాదంటూ - దాన్ని వేరే గిన్నిలో నీళ్లతో కలిపి ఆ పాలు తగుమాత్రం వేసి అటూ యిటూ పూర్తిగా పులిహోర పోగు అంత కలిపేడు.

''ఇహ రుచి చూడు. నీ జన్మలో ఎరుగుదువేమో ! '' అన్నాడు గర్వంగా - యిద్దరూ రుచి చూశారు. అమల ఏం చెప్పగలదూ ? మొగుడేకదా యింత ప్రజ్ఞావంతుడని లోలోనే మురిసిపోయిందో యేమోగాని, పైకి మాత్రం పులిహోర పిడచ ఒకటి చేసి భద్రం నోట్లో మహా నాజూకుగా పెట్టింది. అదే జవాబు !

## స్వయంకృతం

ఆమెకింకేం కావాలి! తనకా యింట్లో వంట పని తప్పిస్తే మరే పనీలేదు. అదీ ఏదో మిషమీద వారం మొత్తం మీద అయిదారు రోజులు ఆయనే వండేస్తూంటే అంతకన్నా అమరసుఖం ఏముంది? అదే బాగుంటుంది. ఎన్ని జన్మలెత్తినా యిటువంటి వారే భర్తగా దొరకాలని దణ్ణం పెట్టుకుంటూందేమో!

అయితే దీనికంతటికీ కారణం భర్త అయ్యవారి ఉద్యోగంలో ప్రవేశించడం, గవర్నమెంటువారు అలా ఎంచి పెట్టిన బేసిక్ ట్రయినింగు విధిలేక అవడం, ఏది అయితేనేం యీ విషయంలో ఆడవారందరూ గవర్నమెంటువారికి కృతజ్ఞులయి వుండాలి. వారి ఋణం తీర్చుకోలేరు. అయితే అందరిమాట ఏమోగాని ఆమెకి ఒక చిన్న బాధ లేకపోలేదు.

వంట ఒక్కదానిలోనే ఆయనగారి బేసిక్ ట్రయినింగు ప్రజ్ఞ చూపెట్టి వూరుకుంటే బావుండును! అక్కడ అయిపోయిన అలవాటు చేత ప్రతిదానిలోనూ కలగజేసుకుంటారు కదా! ఇలా యింటో జనానా చెయ్యవలసిన పనుల్లో తను కలగజేసుకొని ఆమెగారిని కూర్చోబెట్టి తనే పరిష్కారం చేస్తూంటే ఆమెలాంటి దేవత అలా అయినప్పటికీ లొంగివుందిగాని, మరోలాటివారయితే నాలుగు రోజులకే నెత్తికెక్కరూ? కేవలం దీనివల్ల ఏమీ తెలియని వాళ్ళకి సోమరితనం చేతులారా మప్పడం కదూ! ఇహను దానికే అలవాటు పడిపోతే మళ్ళీ తాతలు దిగొచ్చినా వాళ్ళు చేస్తారా? ఎందుకు చేస్తారు? అప్పుడు వాళ్ళది తప్పుకాదు! విసుక్కుంటే ఏం లాభం? అయితే ఇందులో మొగవాడిదీ తప్పులేదు. ఎంచేతంటే - పాదు తాలూకూ కొనని ఎటు తిప్పితే అటు వయిపే ప్రాకుతుంది. అది సహజం. అలాగే మొదటి నుండీ యేది అభ్యాసమైతే అదే అలవాటయిపోతుంది. ఆ అభ్యాసం కడతేరా వుంటేనేగాని తోచదు. ఆ తర్వాత మార్చదలుచుకున్నా మారదు!

అలాగే బేసిక్ ట్రయినింగు అయిన భద్రం కూడా అక్కడ, వంట చెయ్యడం, గిన్నెలు తోమడం, బట్టలుతుక్కోవడం, దారం తీయడం, తుడవడం, పెంటలెత్తడం, నీళ్ళు తోడడం, పాదులు కట్టడం, యిలాటి పనులు నేర్చుకోవడం వల్ల అదంతా అలవాటయి పోయింది. పూర్తిగా వంట బట్టిపోయి అవి దినకృత్యాలకింద చెయ్యకపోతే తోచదు. మరో వ్యాపకం కలిగించుకోలేదు. ఎంతసేపూ వంటింటి మీదో మరో అలవాటయిన పనులమీదనో తనువు. అయితే వీటిలో కొన్ని మంచివి లేకపోలేదు. కాని అవి అంత తప్పనిసరిగా చెయ్యవలసిన, నేర్చుకోవలసిన, అవసరం లేదు. ఎందుకంటే -

ఇహ మీదట ఏమోగాని యిప్పటి వరకూ వంట మొదలయిన గృహ కృత్యాలు ఆడవాళ్ళే చేస్తున్నారు! గిన్నెలు తోమడానికి, తుడవడానికి యిలాటి చిల్లరపనులకి పనిమనిషి వుంటుంది. బట్టలుతకడానికి చాకలి అందరికన్నా ముఖ్యావసరం. ఇహను కష్టపడి సంపాదించిన డబ్బుతో కూరగాయలూ, దినుసులూ మొదలయినవి కొనుక్కుంటారు, ఇది ప్రతి యింట్లోనూ సాధారణంగా జరుగుతున్నది. అయితే యిదంతా మార్చి, యీ పనులన్నీ తనే చేసుకుంటా మంటే అది ఎందుకోసం? దానివల్ల ఖర్చు తప్పదు. డబ్బు మిగలదు, సరికదా వృధా శ్రమపడడం అవుతుంది.

అదీకాక మనకి అందుబాటులో వున్న యిలాటివి చిన్నపనులో చేసుకోగలిగినా, ప్రపంచంలో ప్రస్తుతం ఎన్నో జీవితావసరాలు వున్నాయి. అవన్నీ ప్రతి ఒక్కరూ చేసుకోగలరా? అన్నీ స్వంతగా

కావాలంటే సబ్బులకోసం సబ్బుల ఫ్యాకరీ పెట్టగలడా ? బట్టల కోసం మిల్లు పెట్టగలడా ? ఒక వుద్యోగంలో వుంటూ దినుసులకోసం పొలం పని చెయ్యగలడా ? అది అసంభవం.

అంచేత వీటన్నింటినీ సాధించేది ఒకటి వుంది - అది డబ్బు. దానికి సాధ్యం కానిది లేదు. అంచేత అది సంపాదించాలి. అందుకు ఉద్యోగం ఒక సాధనం. కాబట్టి, ఒక్కొక్కపని ఒక్కొక్కరు చేస్తేనే గాని, యిన్నింటినీ తయారు చేసి అనుభవించడానికి వీలుండదు. ఎవరు చేయవలసిన పని వారే చెయ్యాలి ! డబ్బు మూలంగా అన్నీ లభ్యం అవుతాయి, ఉద్యోగం మూలంగా డబ్బు దొరుకుతుంది. అయ్యవారి వుద్యోగానికి జీతం యిస్తున్నారు. ఆ జీతం వినియోగించి ఎవరికి కావలసినవి వారు వారి తాహతు ప్రకారం సంపాదించుకుంటారు.

అయ్యవారి ఉద్యోగధర్మం, పిల్లలకు సరిఅయినతోవలో పనికివచ్చే విద్య నేర్పడం, దానిమీదే కేంద్రీకరించి ఆ వచ్చే జీతంతో కాలక్షేపం చెయ్యడం. అంతేకాని, అంతా స్వయం కృషి కావాలని పిచ్చిలో పడి వంటా, పెంటా యిటువంటి వాటిలో పడితే తన విధి ఎలా నిర్వర్తించుకోగలడు ? అటు స్కూలుకి పోయి పాఠాలే చెబుతాడా ? యిటు యీ వెర్రి ఆదర్శాలనే పట్టుకు కూర్చుంటాడా ?

పోనీ - బేసిక్ ట్రయినింగయిన అయ్యవార్లని, హైస్కూళ్లలోనూ, మరికొన్ని చిన్న బళ్లలోనూ మేష్టర్లుగా వేస్తున్నారు. అయితే యీ వుపాధ్యాయులు పొందిన శిక్షణ వేరు, యిక్కడ వీరు చెబుతున్నది వేరు. ఎలాగంటే - అక్కడ అయ్యవార్లకి బేసిక్ ట్రయినింగులో చెప్పి చేయించిన పనులు - వంట వండడం, గిన్నెలు తోమడం, బట్టలుతుక్కోడం, పెంటలూడవడం, నీళ్లు తోడడం, యిలాటివి. ఇవి హైస్కూళ్లలోనూ, ఆ చిన్న బళ్లలోనూ చెబుతున్నారా ? యిప్పటివరకూ లేదు ! అంచేత వీరు నేర్చుకొన్న విద్య ఒకరికి చెప్పకపోవడం చేత వృథా అయిపోదా ? అంటువంటప్పుడు ఆ అయ్యవారలకు మాత్రం ఆ శిక్షణ ఎందుకు ? ఎవరికోసమని ఆ శిక్షణ ! యింకా ముఖ్యమయినవి ఎన్నో ఎందుకు చెప్పలేదు ? ఉద్యోగం చేస్తూ అవన్నీ చెయ్యలేడు గనుక, ఆ వృత్తులకి వేరేవారు వున్నారు గనుక, యీయన కిచ్చే జీతంతో వాటిని కొనుక్కొని జీవించగలడు గనుక చెప్పలేదు. అయితే ఆ నాలుగు పనులూ మాత్రం ఎందుకు చెప్పాలి ! ఇలా ప్రతిమనిషి, తన కుటుంబంలో అందరిచేత చాకలి పని, సాలిపని, పాకీపని, పొలంపని, మంగలిపని అన్నీ స్వయంగా చేసుకుంటూపోతే బాగానే వుంటుంది గాని, చాకలి, మంగలి, దాసి మొదలైన చిన్న జీతగాళ్లందరూ ఏమవుతారు ? అందరూ అందలమెక్కితే మోసేవారెవరన్నట్టు అవుతుంది.

అయితే యీ బేసిక్ ట్రయినింగు అని యింత శ్రమ ఎందుకు పెడుతున్నారు అని ఆలోచిస్తే - మనలో మనమాట ! - యీ అయ్యవార్ల కిచ్చే జీతం తక్కిన వారితో సరిపోల్చి చూస్తే చాల తక్కువకాదా? వీటికీ మాటికీ జీతాలు ఎక్కువ చెయ్యండి, ఎక్కువ చెయ్యండి అని, నిప్పులో పడిన మిరపకాయల్లా ఘాటు ఘాటుగా ఒక్కొకసారి లేస్తూంటారు ! వీళ్ల నోరు నొక్కాలంటే ఒకటే పద్ధతి. అదేమిటీ అంటే వీళ్ల యింటి ఖర్చు సాధ్యమయినంత మట్టుకు తగ్గించి వేయడం ! అదెలా సాధ్యమవుతుంది ? వుత్తి పుణ్యానికెవరూ సహాయం చెయ్యరు కదా ? చాకలి పనీ, మంగలిపని, కూరగాయలు పండిచడం, అంగుళంపాటి దళసరి దారాలు తియ్యడం, యిలాటి ఎన్నో చిన్న చిన్న

నిత్యావసరాలని కొన్నిటిని సప్పితే, జీతం చాలనప్పుడు, అది ఎలాగూ వచ్చును కనుక వచ్చినట్టు అటువంటి పనులన్నీ స్వయంగా చేయగాని ఆ ఖర్చులు మిగుల్చుకుంటారు. మాటిమాటికి జీతం పెంపు కోసం ఆందోళన చెయ్యరు.. ఇలా చేస్తే దెబ్బకి రెండు లాభాలని... వుద్దేశ్యం అయివుండొచ్చు. ఇది నిజం అయినా అబద్ధం అయినా, అనుకోడంలో తప్పేమీలేదు.

భద్రం అటువంటి ఆలోచనలోనే పడిపోయి, సంసారంలో కలతలు తెచ్చుకున్నాడు. అసలికి ఏదో కొన్ని విషయాల్లో భద్రం స్వభావం నచ్చినా, యిటువంటి వాటిల్లో అతనితో కలియలేకపోతూంది. అవసరంలేని వాటిల్లో కలుగజేసుకొని వృథా బాధపడుతున్నాడని ఆమె విచారం. పోనీ డబ్బేమన్నా మిగులుతూందా అంటే అదీ లేదు. వట్టి శ్రమ, చాకిరీ మాత్రం మిగుల్తున్నాయి. బాధ్యత లేని పనుల్లో చెయ్యి చేసుకుంటే ఏమవుతుంది? భద్రం సంగతి విచిత్రంగానే వుంది.

రోజు రోజుకీ భద్రంకి పిచ్చి లావయిపోతూంది. ఏదయినా చిన్న కారణం కనబడితే చాలు తనకి అన్నీ వచ్చునన్న అహంభావంతో ఇంట్లో పని వాళ్లందర్నీ మానిపించేయడం మొదలెడుతున్నాడు. ఓనాడు చాకలివాడు వచ్చేడు. ఆనవాయితీ ప్రకారం ఆనాడేదో గుడ్డ యివ్వలేదు. దానికితోడు మరో పైసా ఎక్కువ చేస్తేనేగాని కష్టం తీరదన్నాడు. యీ నెపం మీద మానిపించేశాడు. కాని ఏం సుఖపడ్డాడు? సర్ఫు కొని, గంటలకొద్దీ కాలం వృథాపరిచి వుతకడమేగాని. ఒక బట్టా తెలుపు రాలేదు. మురికి వాసన చెమటవాసన ఎంత వుతికినా పోలేదు. వాడిని మానిపించిన లాభం లేకపోగా చాకలి సోడా, నీలిమందూ బట్టలసబ్బు కొనాలి! బొగ్గుల ఖర్చు, కర్రల ఖర్చు, యివన్నీ పెట్టుకునే కన్న - మొత్తం మీద అందరి బట్టలూ వుతికేవాడు చాకలికి బట్టి వాడికే కిడుతుంది, చవుక అనిపిస్తుంది! అదీ కాక ఇస్త్రీ లేనిదే బట్ట కట్టలేం! దానికోసం అధమం 5 రూపాయలయినా అవుతుంది. ఆ అయిదు రూపాయలయినా యిస్తే - మాటాడకుండా వుతికే చాకళ్లు యింకా వున్నారు! చాకలి ఏనాడో ఒక చిన్న బట్ట పారేసేడూ అంటే అనుభవంలేని యీ స్వయంకృషి వల్ల ఎన్ని బట్టలు యిస్త్రీ పెట్టెకి ఆహుతి అయిపోతాయో!

నాలుగు రోజులు కదురాడించినంత మాత్రంలో తనకీ తన భార్యకీ కుటుంబానికి సరిపడ్డ బట్ట తనొక్కడు తయారు చెయ్యగలడా? అలాగని యీ పని చెడ్డదని కాదు. దారం తీయవచ్చు. దానిని వుపయోగించే విధంగా వుపయోగించాలి! అంతేగాని భద్రం లాగ తను తీసిన అంగుళం దళసరి దారం బట్ట నేయించి, పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం లాగు, చొక్కాలకీ, చీరలకీ, పంచలకీ, అంగవస్త్రాలకీ, ధోవతులకీ ఆ ఒక్క బట్టే ధరించగలరా? యిహ నటువంటి బట్ట కట్టుగొని భార్యని చూసి తనూ తనని చూసి ఆమె ఏం ఆనందించగలరు? బ్రతికిన మూడురోజులూ ముచ్చటగా వుండక యిదెవడు చెప్పిన బుద్ధి? అతడెలాగయినా కక్కుర్తి పడగలడు గాని యింట్లో ఆడది వూరుకోగలదా? కొత్తరకం కనబడితే చాలు కొనుక్కొని కట్టుగోవాలని వాళ్లకి వుంటుంది! అటువంటిది కూర్చుంటే లేవలేనంత బరువయిన ఖద్దరు చీర కట్టుకు పడి వుండమనడం ధర్మమా! అలాగని ఖద్దరు చీరలు గాని బట్టలుగాని కట్టకూడదని కాదు. ఇష్టమయినవాళ్లు కట్టుగోవచ్చు, నిర్బంధించకూడదు! కాని భద్రం అలాక్కాదు!

అతడికి కులాసాగా ఒక్క ఘడియ కాలక్షేపం చేద్దామంటే తీరికలేదు. అస్తమానూ ఏదో ఒక

పని, అదీ పనికొస్తుందనుకొనే పనికిరాని పని.

పట్టుదల గల మనిషి కాబట్టి ఎలాగో సాగుకొస్తున్నాడు గాని అనుల పరిస్థితి మరీ విషమించిపోయింది. కోతిపిల్ల సామ్యంలాగ అతనేం చేస్తే అది చెయ్యవలసి వచ్చింది. ఆఖరికి ఆమెకి జీవితం మీద విసుగూ, విరక్తి, చిరాకూ, నిరాశ ప్రవేశించేయి. తనతోటి వాళ్లు యీ యీడులో యిలాగే వుంటున్నారా ? జీవితంలో ఎంతో ముచ్చటగా, ఆనందంగా సుఖించవలసిన రోజులన్నీ వృథాగా స్వయం కృతాపరాధంవల్ల పాడయిపోతున్నాయి. ఆ వయస్సులో మూడు పువ్వులూ ఆరుకాయలుగా వుండవలసింది !

మొదట్లో వైవాహిక జీవితం, భర్తతో కాపురం, కొత్త స్నేహం అంటే ఏమిటో కలలు కన్నది. కాని అవన్నీ చూస్తుండగా అంతరించిపోయే లాగున్నాయి. జీవితం అంధకారంలా వుంది. రాత్రి పగలూ ఆమెకి అదే ఆలోచన పట్టుకుంది ! తన జీవితాన్ని ఎలాగయినా యధారీతికి తీసుకురాగలదా ? భర్త దృష్టి మరల్చగలదా ? ఏమో అటు భద్రంని చూస్తే అతనికీ రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు. ఎప్పుడూ దీర్ఘాలోచనలో వుంటాడు !

ఇదంతా ఎంచేతో అనులకి పూర్తిగా తెలుసు. అనవసరంగా బాధపడడం, వంటికి తెచ్చుకోడం దేనికని రోజూ భద్రంతో చెబుతూనే వుంది ! కాని - అతను వినడు.

ఆ రోజు భద్రం వంటకాలన్నీ సిద్ధం చేసి బయటకు వెళ్లేడు. అనులకు ఒక బుద్ధి పుట్టింది. నెమ్మదిగా వెళ్లి యింత వుప్పూ, కారం తీసుకువచ్చి, కూరల్లోనూ మిగతా వాటిల్లోనూ బాగా కలిపేసింది. అన్నం తీసుకుపోయి తిరిగి పొయ్యిమీద పెట్టి పావుగంట సేపుంచి తీసేసింది. ఏమీ ఎరగని దానిలా భద్రంని భోజనానికి పిలిచింది. వ్రత కథ పూర్తి అయిన తర్వాత ప్రసాదం కోసం కనిపెట్టుకున్నట్లు మహా ఆత్రుతగా కూర్చున్నాడు. విస్తట్లో ఒక్కొక్క పదార్థం వేస్తూంది. పేకాటలో ముక్కలన్నీ పంచిన తర్వాత గాని కొందరు తీసి చూసుకోరు. భద్రం అలాగే అన్నీ వడ్డించడం అయేవరకూ వున్నాడు. అన్నం గిన్నె తెచ్చింది. ఆ అన్నం గరిటతో స్వాధీనం కాలేదు సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపమయిన అన్నం తాలుకు అప్పటిస్థితి చూడగానే భద్రంకి అనుమానం తగిలింది ! ఆఖరికి గిన్నె బోర్లించి మీదని కొట్టగా కొట్టగా, పుసుక్కుని దిగజారింది సున్నపు వుండ లాంటి అన్నం ముద్ద. అన్నం చూడగానే నిశ్చయించుకున్నాడు. మిగిలినవి రుచి చూసేడు. అబ్బే ! ఒక్కొక్కటీ నాలికమీద పెడుతూంటే నైట్రికాసిడూ, పొటాసియం సైనేడూ ఇలాంటివి రాసుకుంటున్నట్టున్నాయి. నాలిక లాక్కుపోతూంది! అవన్నీ అలాగే వుంచేసి కాస్త మజ్జిగ ఆ సాజ్జిలో పోసుకొని క్షుద్బాధ తీర్చుకున్నాడు.

అతనికి చాలా ఆశ్చర్యం వేసింది. తన వంటలో యిలాగెప్పుడూ అవలేదు ! అసలు వంట నేర్చుగానే కొత్తలోనయినా దేనిలోనూ అరుచి కలిగేట్టు వండలేదు ! వండగా వండగా తన వంట అనకే ఏవగింపుగా వుందేమో ! ఛా ! ఛా !! - జిహ్వ ఒకటి వుండి చెబుతున్నది కదా ! అనులని రుచిచూడమన్నాడు! ఆవిడ కూడా అదోలా ముఖం పెట్టి అన్నిటినీ అవతలకి నెట్టేసింది! ...

భద్రంకి చిన్నతనం అనిపించింది ! దానికితోడు అతని అభిమానానికి అఘాతం తగిలింది.

నోరెత్తి ఏదీ అనలేకపోయాడు! ఒక్కటే విచారం పట్టుకుంది! ఎందుకిలా అవాలి? మరిచిపోయి రెండోమాటు ఉప్పుకారం వాటిల్లో వేసేడనుకుంటే, అన్నం మాట? సరిగ్గా మగ్గేవేళకి దింపేశాదే! భద్రంకి పట్టుదల లావయింది!

అమలకి కారణం తెలుసు కాబట్టి అట్టే ఆలోచించలేదు. అన్ని వస్తువులూ అలాగే పారపోసింది. తను అనుకొన్నది నెరవేరితే కొన్నాళ్లపాటు తన ఆరోగ్యం భర్త ఆరోగ్యం సరిఅయిన తిండిలేక పాడయినా సరే అనుకుంది. ఆఖరికి యిదొక్కటే ఉపాయంగా కనిపించింది ఆమెకి. కాని- భద్రంకి పట్టుదల, పంతం లావయినాయి. ఆ మర్నాడు అతి జాగ్రత్త మహా జాగ్రత్తగా పాకశాస్త్రాన్ని పాకంతీసి మరీ వదిలేడు. కాని భోజనాలవరకూ అక్కడే కూర్చోడు కదా, వేరే బట్టకట్టుకుందుకయినా వెళ్లాలి! అయినా వండడం అంటే తన పని గాని వడ్డించడం అమల పనేగా! ఎలాగయినా సందు చేసుకోగలదు యింతకీ యీ పని అమల చేస్తున్నదని అనుమానమయినా కలుగలేదతనికి.

అన్నీ పాడుచేస్తే ప్రయత్నపూర్వకమే అని తెలిసిపోతుందని అమల ఆనాడు కొన్నిటిని మాత్రమే నోట్లో పెట్టలేనట్టు చేసింది. భద్రంకి క్రిందటిరోజు కన్నా ఎక్కువ విచారం పట్టుకుంది. దానితో కోపం లావయింది! ఎవరిని ఏమనడానికీ వీలులేక ఆ కోపం, అహంభావం కింద మారింది. -ఎంతో జాగ్రత్తపడినా యిలా ఎందుకయిందని కృంగిపోయేడు. అమలని నాలుగయిదుసార్లు కారణం అడిగేడు. ఆమె తెలియనట్టే జవాబు చెప్పేసింది; ఆ వేళ సరిగ్గా భోజనం తినలేదు, సహించక లేచి వెళ్లిపోయేడు.

అమల బెదరలేదు, మొగుడలా అర్థాకలితో వెళ్ళిపోయినా సహించి తన ప్రయత్నం మాత్రం మానలేదు! యిలా రోజూ ఏదో ఒకటి చెడిపోతూంటే, తనగొప్పదనం, శక్తీ చూస్తూ చూస్తూండగా పోతున్నట్టుయింది భద్రంకి. తన మీద, తన వంట మీద విసుగూ చికాకూ అసహ్యం పుట్టనారంభించింది. సంపూర్ణ సిద్ధిపొందిన శిల్పి, ఒక్కసారిగా అకారణంగా తయారు చేస్తున్న శిల్పాలన్నీ పాడవుతూంటే అతనికి ఎలా వుంటుంది? తన చేతిలో శిల్పం ఏమయిపోయిందని అహోరాత్రాలూ, ఆలోచిస్తూండిపోడా?

ఇరవయి నాలుగ్గంటలూ విసుక్కోవడం చిరాకుపడడం మొదలెట్టేడు. కాని ఎన్నాళ్ళిలా సరిఅయిన తిండి లేకుండా వుంటారు? మనసు పాడయింది! ఇహ నీ వంటపీడ వదిలిపోతే బావుండుననిపించింది. కాని తనంతట తనే అమలని వద్దని వంటపనికి నడుం కట్టేడు కదా? ఇప్పుడు తనే తిరిగి అమలతో ఆ సంగతి చెప్పగలడా? చింత చచ్చినా పులుపు చావదన్నట్టు, అతని అభిమానం ఒప్పుకుంది కాదు! కాని ఏ నిముషాన్ని తెగించి చెప్పేద్దామా? అని చూస్తున్నాడు! అమల యిది గ్రహించి అతని వైఖరీ, మనసులో జరుగుతున్న పోట్లాటకీ నవ్వుకుంటూ అతని దగ్గరికి వచ్చింది.

"ఏమండీ అదే మనసులో పెట్టుకొని రోజూ సరిగ్గా తిండి కూడా తినడంలేదు. మరీ చిక్కిపోతున్నారు! పోనీ కొన్నాళ్లూరుకోరాదూ! నేను లేనా ఎలాగో ఒకలాగ వండడానికి? ఒకరికి.... పని లావయిపోయి, రెండోవారికి పనిలేక, సోమరితనం లావయీ రెండు విధాలా చెడడం అయింది.

నామాట వినండి'' అని ఎంతో యిదిగా చెప్పింది.

ఎలాగో ఒకలాగ యీ బాధ వదుల్తేచాలని చూస్తున్న భద్రం ఆవిడ మాటల్లో వెటకారం, ఎత్తిపొడుపులూ ఎన్ని వున్నా ఏమీ అనలేక పైకి మాత్రం - ''సరే అలాగే కానివ్వు... ఒకరు బాగా చేస్తున్నారని ఓర్వలేకపోతే ఏమిటవుతుంది.. ఆ పేరు నువ్వే పొందు!'' అన్నాడు... ఇహ అతనితో మరేమన్నా ఘర్షణ తప్పదని అమల వూరుకుంది. తన హక్కులలో ఒకటి శాంతి మార్గంలో సంపాదించుకున్నందుకు - తన పద్ధతి ఫలించినందుకూ సంతోషించింది. ఇహ ప్రతి విషయంలోనూ యీ పద్ధతే ప్రయోగించడం మొదలుపెట్టింది. అయితే అదీ ఎంతో నేర్పుతోనే అనుమానం కలగకుండానూ చేస్తోంది. అది మొదలు వంట పదార్థాల్లో మరి తంటా ఏర్పడలేదు. భద్రం మరి వంట జోలికి పోనూ లేదు!

ఒకనాడు భద్రం యథాప్రకారంగానే తను స్వంతంగా తీసిన దారంతో నేయించి తెచ్చి గోనెలాటి నేత తాను ఒకటి అమలకి చూపెట్టేడు.

అమలకి అదో మనోవ్యథ అయిపోయింది! ఆ బట్టని చూడగానే ఆమె శరీరం ఆమెకే బరువయిపోయింది. ఆ ఖద్దరు లోనేనా సన్నంది తెస్తే అమల ఏమీ అనకపోనుగాని తను తెచ్చిన ముతగల నూలతోనే, చీరలకీ, చొక్కాలకీ, తువ్వాళ్ళకీ దుప్పట్లకీ, పంచలకీ, జాకెట్లకీ, ఎంపుగాని కట్టుగోనుంటాడు. అతని కిష్టమయితే అతను అలా వుండొచ్చు గాని మరో వ్యక్తిని కూడా అలాగే వుండమని నిర్బంధిస్తేమట్టుగు చికాకే! అతని ముందర అమలేమీ అనలేదు.

ఆ మర్నాడు, ఆ బట్టని జాగ్రత్త పరచడానికని అమల విప్పి చూసింది! ఒకటి రెండు చోట్ల ఎలకలు కొట్టేశాయి... అమలకి విచారం కలగలేదు సరికదా మరో ఆలోచన తట్టింది. వెంటనే ఆ తానుని ఏ భాగం కూడా పనికిరానట్టు అలాంటి చిల్లుల్లే పెట్టేసింది. ఎప్పటిలాగే వుంచేసింది.

భద్రం వచ్చి, అన్నిటికీ పనికి వచ్చినట్టు పంపకాలు చెయ్యడానికి తాను తీసేడు! యింకేం వుంది! ఎందుకూ పనికి రాకండా తాను తానంతా కన్నాలు పడిపోయింది! అమలకు చెప్పేడు. ఎలకలు కొట్టేసాయని. యిద్దరూ వాటిని కసిదీర తిట్టేరు. ''తెచ్చి పెట్టెలో పెట్టలేక పోయారా ?'' అని అమల మీదుమిక్కిలి అడిగేటప్పటికి భద్రం ఏమీ అనలేక వూరుకున్నాడు.

ఆ ఏడాదికి సరిపడ బట్టంతా వృథా అయింది! నష్టమయిపోయింది! మళ్ళీ కొనుక్కోపోతే తనకీ, భార్యకీ కూడా బట్టలు లేవు. తను కష్టపడి ఒడికిన నూలు అంతా కలిపి యీ తాను నేయించాడు. మరి నూలు లేదు. ఇంక బజారులో కొనకతప్పదు. మళ్ళీ ఖద్దరే కొంటానని చెప్పేడు కాని అమల ఒప్పుకోలేదు, కొనడం యిష్టంలేకపోతే పూర్తిగా మానేయండి గాని ఆ బట్ట మరి కట్టలేనని చెప్పేసింది. భద్రం ఏమీ చెయ్యలేకపోయాడు. ఆమెకి ఒక మంచి చీర కొని తెచ్చేడు. తనుమాత్రం మంచి రకం ఖద్దరు తెచ్చుకున్నాడు... ఇది నాంది కాగానే మరి భద్రం ఖద్దరు బట్ట అమలకి కొనలేదు. .. రాను రాను తనూ అప్పుడప్పుడు మిల్లు బట్టలు వాడేస్తున్నాడు.

ఈ రెండు సంఘటనలూ యిలా జరగడంతో భద్రం పూర్తిగా మారిపోయేడు యిప్పుడు అమల ఏం చెబితే అది చేస్తున్నాడు. పూర్వపు పట్టుదల మంచిదికాదని అతనికి అర్థమయింది. తన

స్వయంకృతాపరాధం తనకు తెలిసింది.

ఆ తర్వాత వాళ్ల బట్టలు చాకలాడు నాలుగు రోజులు ఉతికితే గాని అసలు రూపుకి రాలేదు. యింట్లో పై పనులు పనివాళ్లు చేసుకుంటున్నారు కాబట్టి తనకీ, భద్రంకీ కాస్త మాటాడుకుందికి వీలుబడి అయింది. సినిమాలకూ, షికార్లకూ సమయం దొరికింది. విందులూ, వినోదాలకూ విరామం దొరికింది.

ధైర్యంతో ఆయన తీసుకున్న యీ పోరు వలన వారి జీవితంలో వసంతం వచ్చింది. నిస్తేజంగా వున్న వారి సంసారం నిత్యనూతనమయింది. వారి దాంపత్యం మూడు పువ్వులూ ఆరుకాయలుగా ఆనందమయమయింది.

★ ★ ★

(ఆంధ్రసచిత్ర వారపత్రిక, 12-5-1954)